బీటీరోడ్డుకు మోక్షమెప్పుడో?

ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలకులు మారుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల దుస్థితి ఎక్కడవేసిన గొంగడి అక్కడేనన్న చందంగా మారింది. మండలాలు.. గ్రామాలకు అనుసంధానమైన బాటలు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

- వాగుపై వంతెన లేక ప్రాంత ప్రజల ఇబ్బంది
- అమలుకు నోచుకోని నేతల హామీలు
- ప్రతిపాదనలకే పరిమితం


రాళ్లురప్పలతో మంగళపల్లి- చెన్నారం రోడ్డు

ఆమనగల్లు: మండల పరిధి మంగళపల్లి నుంచి తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. రాళ్లరప్పలతో వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. రెండు మండలాలను కలిపే ఈ మార్గం గుండా బీటీరోడ్డుతో పాటు.. మధ్యలో ఉన్న వాగుపై వంతెన నిర్మించాలని ఏళ్ల తరబడి ప్రాంత ప్రజలు.. ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నప్పటికీ.. హామీలకే పరిమతం అవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. సుమారు 5కిలో మీటర్ల దూరం ఉన్న మంగళపల్లి- చెన్నారం పూర్తిగా ధ్వంసమై.. వాహనాలు పరుగులు తీయలేని దుస్థితి నెలకొంది. ఆ మార్గం గుండా ముందుగా వాహనం వెళితే.. దుమ్ముధూళితో వెనకాల వచ్చే వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రమాదం బారిన పడే అవకాశం లేకపోలేదు. ఈ రూట్లో బీటీరోడ్డును నిర్మిస్తే.. ఆమనగల్లు, షాద్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారి రవాణా కష్టాలు తీరుతాయని పరిసర ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

వాగు ప్రవహిస్తే రాకపోకలు బంద్

మంగళపల్లి సమీపంలోని వాగుపై వంతెన లేని కారణంగా ప్రాంత రైతులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వానాకాలంలో వాగు ప్రవహిస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగనుంది. ఈ మార్గంగుండా మంగళపల్లికి చెందిన రైతుల పంట పొలాలు వాగు అవతలి వైపున ఉండటంతో.. అంటుగా వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతుంటారు.

“వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు



మంగళపల్లి నుంచి చెన్నారం వరకు బీటీరోడ్డు, వాగుపై వంతెన నిర్మించాలని సుదీర్ఘకాలంగా కోరుతున్నాం. ఇటీవల కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి వినతిపత్రం అందజేశాం. స్పందించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభం అవుతాయి.

– జిక్కు అనంతరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ, ఆమనగల్లు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ వైఫల్యాలపై ఉద్యమించాలి
- బీజేపీ నాయకులు


కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని కౌన్సిలర్ లక్ష్మణ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్‌లు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని 15వ వార్డులో ఆదివారం 180వ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో శక్తికేంద్రం ఇన్‌చార్జి మక్తాల వెంకటయ్య సమక్షంలో కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా మహేశ్, ఏజెంట్‌గా కృష్ణయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల తిరస్కారానికి గురైందని విమర్శించారు. ప్రజాసమస్యలపై పార్టీ ఎప్పటికప్పుడు ఉద్యమిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేశ్, కిట్టు యాదవ్, వెంకటేశ్, గిరియాదవ్, లక్ష్మణ్, రాజు, యాదయ్య, రవి, జగన్, ప్రవీన్, శ్రీకాంత్, రవితేజ, నిఖిల్, నాగయ్య, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌కు సన్మానం


చైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కడ్తాల్: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత దంపతులను మక్తమాధారం గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు కార్యక్రమంలో పూలమాలలు వేసి సత్కరించారు. గ్రామానికి చెందిన గీత చైర్ పర్సన్ కావడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. రైతుల సమస్యలతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఆమెను కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, మాజీ సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మంజుల, మార్కెట్ మాజీ డైరెక్టర్ నర్సింహ, నాయకులు నరేశ్‌గౌడ్, సాయిలు, చంద్రమౌళి, శాబుద్దీన్, కృష్ణ, చెన్నయ్య, నారాయణ, కృష్ణయ్య, గణేశ్, యాదగిరి, శ్రీను, ప్రభాకర్‌గౌడ్, రమేశ్, యూసుఫ్, రాజేందర్, సజీరొద్దీన్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: నియోజకవర్గ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ 14,24 వార్డుల్లో పర్యటించారు. రూ.2 కోట్ల 91 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 16న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాష ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటి పరీక్ష అనంతరం అవసరమైన వారికి ఎనుగొండలోని రాంరెడ్డి లయన్ కంటి ఆస్పత్రిలో నేత్ర శస్త్రచికిత్స చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు పెన్షనర్ల దినోత్సవం

ఆమనగల్లు: పట్టణంలోని ఎస్‌టీయూ భవన్‌లో ఈ నెల 17న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎస్‌టీయూ రాష్ట్ర నాయకుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 80 ఏళ్లు నిండిన పెన్షనర్లను సత్కరించడంతో పాటు.. వారి హక్కులు, భద్రత గురించి చర్చిస్తామని పేర్కొన్నారు. సమావేశానికి ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి మండలాల పరిధి పెన్షనర్లు హాజరు కావాలని కోరారు.

వార్డు అభివృద్ధికి కృషి చేస్తా

కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: వార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కౌన్సిలర్ బాదావత్ రవి నాయక్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 10వ వార్డులో సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. వార్డులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మార్కెట్ ఏర్పాటు చేయాలని సుదీర్ఘ కాలంగా ప్రాంత రైతులు కోరుతున్నారని, వారి కోరిక మేరకు త్వరలోనే పాలకమండలి సభ్యులతో చర్చిస్తామని వెల్లడించారు. అందుకు కావాల్సిన ప్రభుత్వ భూమి ఎక్కడైనా అనుకూలంగా ఉంటే పరిశీలిస్తామని పేర్కొన్నారు. సమస్యను ఎమ్మెల్యేతో పాటు, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మణ్ నాయక్ ఉన్నారు.

పట్టుదలతో పోరాటం చేద్దాం..

సమితి నాయకులతో మందకృష్ణ మాదిగ


మంద కృష్ణతో సమితి మండల నాయకులు

మంచాల: ఎస్సీ వర్గీకరణకు మరింత పట్టుదలతో పోరాటం చేద్దామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సమితి నాయకులకు సూచించారు. మండల పరిధి నాయకులు ఆదివారం నగరంలో మంద కృష్ణను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ కోసం సుదీర్ఘ కాలంగా పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. పోరాట ఫలాలు సాధించుకునే సమయం ఆసన్నమైందని, సమష్టిగా ఉద్యమం చేయాలని తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. జనవరి 27న జరిగే మహాసభకు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారని తెలిపారు. కార్యక్రమంలో సమితి జేఏసీ మండల అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, నాయకులు శంకర్, కృష్ణ, క్రాంతికుమార్, లక్ష్మయ్య, సురేష్, నర్సింహ, శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

పహాడీషరీఫ్: ఇళ్ల మధ్య నెలకొన్న మురుగు సమస్యకు మున్సిపల్ అధికారులు పరిష్కారం చూపారు. జల్‌పల్లి గ్రామం వీకర్ సెక్షన్ కాలనీలో కొద్ది రోజులుగా డ్రైనేజీ సమస్య తలెత్తగా.. సమస్యను కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతకింది నవీన్ గౌడ్ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన కమిషనర్.. ఆదివారంగల్పర్ యంత్రంతో వ్యర్థాలను సిబ్బందితో తొలగింపచేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ కేంద్రం జల్‌పల్లి లో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్లను విస్తరించాలని కోరారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మార్కెట్ డైరెక్టర్

మాడ్గుల: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని మార్కెట్ డైరెక్టర్ జల్ల రమేష్ గౌడ్ అన్నారు. మండల పరిధి బ్రహ్మణపల్లి గ్రామంలో ఆదివారం ఆయన లబ్ధిదారులకు రూ.30 వేల విలువ గల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యచికిత్స చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాంటి వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉందని పేర్కొన్నారు. వైద్య సహాయం కోసం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, సింగిల్ విండో డైరెక్టర్ రమేష్, నాయకులు వెంకటయ్య, ఆంజనేయులు, యాదయ్య, శివ, లబ్ధిదారులు శ్రీకాంత్, కిరణ్ ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

తుర్కయంజాల్: సీపీఎం మున్సిపల్ ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లకు ఒకసారి మహాసభలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. 19న జరగనున్న సభలో పార్టీ నిర్వహించిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలు, పాలకవర్గాల విధానాలపై చర్చించడంతో పాటు, చేపట్టబోయే సభ కార్యాచరణ గురించి చర్చించనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు డి.కిషన్, నాయకులు ఐ.భాస్కర్, కె.శ్రీరామమూర్తి, కె.అరుణ్ కుమార్, జె.ఆశీర్వాదం, పి.శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ


పూజలో పాల్గొన్న భక్తులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాలమణికంఠ అయ్యప్ప దేవాలయంలో ఆదివారం మహాపడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు ఆదిల్ల మహేశ్ కన్నెస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పూజను మద్ది జగదీశ్వర్‌రెడ్డి గురుస్వామి, జగన్మోహన్‌రెడ్డి గురుస్వాములు జరిపించారు. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం పడి వెలిగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తుల గీతాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది.

మెట్రో ఏర్పాటు చేయాలని వినతి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో నాయకులు, కార్పొరేటర్లు

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ చౌరస్తా మీదుగా మెట్రో రైలు లైన్ వెళ్లే విధంగా చూడాలని బీజేపీ నాయకులు ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విన్నవించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో.. మీర్‌పేట కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు, నాయకులు కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎల్‌బీనగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైలు నిర్మిస్తున్నందున, దీన్ని బాలాపూర్ చౌరస్తా మీదుగా ఏర్పాటు చేయడంతో నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రత్యేక చొరవ తీసుకుని మెట్రో ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు.

రోడ్డు విస్తరించి.. లింకును మరిచి

- దూరభారంతో వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బంది
- హైవే నుంచి మామిడిపల్లి మార్గాన్ని కలుపుతూ వంతెన నిర్మిస్తే ప్రయోజనం
- లింకు రోడ్డుకు ఎదురుచూపులు


గుట్టల మధ్య ఒరంగడ్డ జల్‌పల్లి రహదారి


మైసమ్మ ఆలయం వద్ద పెండింగ్‌లో ఉన్న రోడ్డు

పహాడీషరీఫ్: రహదారిని విస్తరించారు. లింకు రోడ్డును మరిచారు. దీంతో వాహనదారులకు, ప్రాంత ప్రజలు దూరభారంతో ఇబ్బంది పడుతున్నారు. దుర్గానగర్ చౌరస్తా(ఒరంగడ్డ) నుంచి తుక్కుగూడ హైవేకు అనుసంధానం చేస్తూ రోడ్డు వేశారు. కానీ.. మామిడిపల్లి గుట్టకు వెళ్లే మార్గాన్ని కలిపే చిన్న లింక్ రోడ్డును విస్మరించారు. దీంతో అటుగా ప్రయాణించే ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చుట్టూ నాలుగైదు కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

2007లో కార్గో రోడ్డు పూర్తి

ఒరంగడ్డ నుంచి నేరుగా లక్ష్మీగూడ, వాంబే కాలనీ, శ్రీరాం కాలనీ, జల్‌పల్లి మీదుగా మామిడిపల్లి వరకు 150 ఫీట్ల విస్తీర్ణంలో 2007లో కార్గో రహదారిని పూర్తి చేశారు. జల్‌పల్లి నుంచి మామిడిపల్లికి వెళ్లే మార్గ మధ్యలో కార్గో రోడ్డు నుంచి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం మీదుగా తుక్కుగూడ హైవేకు మరో రోడ్డు వేశారు. ఈ రహదారిలో కార్గో రోడ్డు నుంచి ఈర్లగండి మైసమ్మ ఆలయం వరకు 750 మీటర్ల పొడవు, తిరిగి గుట్ట పై నుంచి తుక్కుగూడ వైపునకు దాదాపు మూడు కిలో మీటర్ల మేర రోడ్డు పనులను అప్పట్లోనే పూర్తి చేశారు. కానీ మైసమ్మ ఆలయం నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మించలేదు.

కొండలు ఒలిచినా..

రహదారి నిర్మాణంలో భాగంగా పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి దేవేందర్ నగర్, రంగనాయకుల కాలనీ మీదుగా భారీ గుట్టను ఒలిచి.. మామిడిపల్లి మైసమ్మ ఆలయం వరకు రహదారిని నిర్మించారు. కానీ.. పావు కిలో మీటర్ లింకును మాత్రం పూర్తి చేయలేదు. దీంతో కొండలు ఒలిచి రహదారిని నిర్మించినా.. ప్రయోజనం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మైసమ్మ ఆలయం కూడలి వద్ద పహాడీషరీఫ్– మామిడిపల్లి రోడ్డుకు ఇబ్బంది లేకుండా ఫ్లై ఓవర్‌ను నేరుగా గుట్ట పైకి అనుసంధానం చేయాలని ప్రాంత ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానం

ఒరంగడ్డ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు పి- 7 కార్గో రోడ్డును ప్రతిపాదించి 2007లో మామిడిపల్లి వివేకానంద విగ్రహం వరకు పూర్తి చేసిన అధికారులు.. తాజాగా ఎయిర్‌పోర్ట్‌కు రోడ్డును అనుసంధానం చేస్తున్నారు. రూ.29.5 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారి పనులు పూర్తయ్యాయి. ఇదే విధంగా మైసమ్మ ఆలయం వద్ద లింకును పూర్తి చేయాలని వాహనదారుల డిమాండ్.

“వంతెన నిర్మాణమే పరిష్కారం



రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారిలో చిన్న లింకు రోడ్డును పూర్తి చేయకపోవడం సరైంది కాదు. మైసమ్మ ఆలయం వద్ద గుట్ట పైకి ఫ్లై ఓవర్‌ను వేసినట్లయితే రహదారి పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తుంది. మామిడిపల్లి గుట్టలో కంపెనీలు వెలిశాయి. ఇంకా భారీగా ఐటీ కంపెనీలు వస్తున్నాయి. ఈ లింకు రోడ్డును పూర్తి చేస్తే.. అందరికీ మేలు.

– సుమన్ గౌడ్, మామిడిపల్లి

క్లుప్తంగా

హనుమాన్ గాయత్రి హోమం


హోమం చేస్తున్న భక్తులు

యాచారం: మండల పరిధి మాల్ గ్రామం ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ గాయత్రి హోమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షాపరులు, మాల్ మాజీ సర్పంచ్ పడకంటి శేఖర్, కవిత దంపతులు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం


కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాత

యాచారం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనువాస్ ముదిరాజ్ రూ.1,00,116 విరాళం అందజేశారు. అనంతరం దాత మాట్లాడుతూ.. అంబేడ్కర్ వలనే బడుగు బలహీన వర్గాలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే మాల్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న విగ్రహానికి తనవంతు సహకారం అందజేస్తున్నాని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు జంగమ్మ, మాజీ సర్పంచ్ పద్మజ, అంబేడ్కర్ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు లింగం, ఉపాధ్యక్షుడు యాదయ్య, గ్రామ పెద్దలు యాదయ్య, జహంగీర్, జంగయ్య, గడ్డమీది యాదయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి


సాయి సన్నిధిలో పూజలు చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: దత్తాత్రేయ జయంతి వేడుకలను పట్టణంలోని షిరిడీ సాయిబాబ దేవాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారులు రాజేశ్వర్‌రావ్, ఆనంద్‌పాండే, ఆదర్శ్‌పండిత్, నయనాచారిల ఆధ్వర్యంలో దత్త హోమం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు పాపిశెట్టి రాము, ఆంజనేయులు, సన్యాసినాయుడు, చందు, పాపిశెట్టి శ్వేత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ


పడిపూజలో మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీ పటేల్‌గూడలో పాశం భాస్కర్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఇదిలా ఉండగా.. పురపాలక కేంద్రం నుంచి అయ్యప్ప మాలధారులు శబరిమలకు తరలివెళ్లారు.

మంగళ్‌పల్లిలో.. షూటింగ్ సందడి


అభిమానులతో మంచు మనోజ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి మంగళ్‌పల్లిలో నటుడు మంచు మనోజ్ సందడి చేశారు. భైరవ సినిమా షూటింగ్‌లో భాగంగా.. ఆదివారం ఓ ఇటుక బట్టీ వద్ద మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస్‌లతో కలిసి ఫైట్‌ను చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మనోజ్‌తో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.